క్లుప్తంగా

మృతుని కుటుంబ సభ్యులకు డాక్టర్ గణేష్ పరామర్శ



నిజాంపట్నం: నాగేశ్వరరావు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. నిజాంపట్నం మండలం కేసన వారిపాలెం గ్రామానికి చెందిన కేసన నాగేశ్వరరావు శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గణేష్ పార్టీ నాయకులతో కలిసి నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ యార్లగడ్డ వెంకట రాంబాబు, నగరం మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ, నాయకులు పాగోలు వెంకటేశ్వరరావు, దొంతుపోయిన కొండలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లేశ్వరుని బ్రహ్మోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాలు భట్టిప్రోలు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. రాత్రి పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. పూజా కార్యక్రమాలలో తిరువీధుల నాని నాగార్జున-రోజ దంపతులు పాల్గొన్నారు. రాత్రి స్వామి వార్లకు పవళింపు సేవ నిర్వహించారు. ఈ నెల 9 నుంచి శనివారం వరకు స్వామి వార్ల కల్యాణ బ్రహ్మోత్సవాలు జరిగాయి. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి, రేపల్లె ఇన్‌స్పెక్టర్ శనగవరపు కుమార్‌బాబు వంశపారంపర్య ధర్మకర్తలు, అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘీయులు పర్యవేక్షించారు.

పెదపులివర్రులో బ్రహ్మోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన శ్రీ భూ-నీళా సమేత వరదరాజస్వామి దేవాలయంలో పంచాహ్నికంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం, బలిహరణ, అవబృథోత్సవం, రాత్రి పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం, హారతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. శుక్రవారం రాత్రి రథాంగ హోమం అనంతరం రథోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. శ్రీవారి ద్వాదశ ప్రదక్షిణములు, పుష్ప యాగోత్సవం, ఏకాంత సేవ కార్యక్రమాలను కొసరాజు వెంకట సతీష్‌బాబు, పద్మజ దంపతులు నిర్వహించనున్నారు. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి ఇ.సాంబశివరావు పర్యవేక్షించారు.

సూర్యలంకలో షూటింగ్‌కు అవకాశం కల్పించాలని వినతి



బాపట్ల: సూర్యలంకను షూటింగ్ స్పాట్‌గా అవకాశం కల్పించాలని సినీ దర్శకుడు దిలీప్‌రాజా అధికారులను శనివారం కోరారు. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దిలీప్‌రాజా మాట్లాడుతూ ఇప్పటి వరకు పర్యాటక కేంద్రంగా ఉన్న సూర్యలంక బీచ్ తీరాన్ని సినిమా షూటింగులకు స్పాట్‌గా ఏర్పాటు చేయాల్సిందిగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ వినతి పత్రం ఇచ్చిందని తెలిపారు. చిత్రీకరణకు వచ్చే నటీనటులకు సాంకేతిక నిపుణులకు వసతి సౌకర్యంతోపాటు షూటింగ్ చేయటానికి అవకాశం ఉన్న ప్రాంతంగా వివరించినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అచ్చన కిషోర్, శ్రీనివాసయాదవ్, మణి వరుణ్, నరేష్ దోనె ఉన్నారు.

నేడు అల్లూరులో ఉచిత వైద్య శిబిరం

అల్లూరు(కర్లపాలెం): పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు బుడేసాహెబ్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫజుల్‌రెహ్మాన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుంటూరులోని ప్రముఖ ఒమేగా హాస్పిటల్స్ వైద్యులు వైద్య సేవలందిస్తారని చెప్పారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఈ వంతెనలు.. ప్రమాదాలకు నిలయాలు



రేపల్లె-ఉప్పూడి రోడ్డులోని మురుగు కాల్వపై సైడ్‌వాల్స్ విరిగి ప్రమాదభరితంగా ఉన్న వంతెన



మొళ్లగుంట కట్టవ వద్ద ప్రమాదభరితంగా మారిన వంతెన

- ఆదమరిస్తే అంతే సంగతులు
- సైడ్‌వాల్స్ శిథిలమై ప్రమాదభరితంగా మారిన వైనం

రేపల్లె రూరల్: మండలంలో పలు వంతెనలు ప్రమాదభరితంగా మారుతున్నాయి. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లే మార్గంలో మురుగు కాల్వలపై, పంట కాల్వలపై గతంలో నిర్మించిన వంతెనలు ప్రమాదాలకు నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. వంతెనలు శిథిలావస్థకు చేరటం, సైడ్ వాల్స్ శిథిలమై పడిపోవటంతో ఆయా ప్రాంతాలలో ప్రయాణం అత్యంత ప్రమాదభరితంగా మారింది. కొన్ని ప్రాంతాలలో విద్యుత్ దీపాలు లేకపోవటంతో రాత్రి సమయంలో ఆ వంతెనలపై బిక్కు బిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. తరచూ ఆయా వంతెనల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ఘటనలు అనేకం ఉంటున్నాయి.

మండలంలో వంతెనల పరిస్థితి ఇలా...

రేపల్లె పట్టణం నుంచి ఉప్పూడి వెళ్లే మార్గంలో మురుగు కాల్వపై సంవత్సరాల క్రితం నిర్మించి వంతెన సైడ్ వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ మార్గంలో ఉప్పూడి గ్రామం నుంచి వందల సంఖ్యలో రేపల్లెకు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండటంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రయాణ సమయంలో ఆదమరిస్తే మురుగు కాల్వలో పడే ప్రమాదం ఉంది.

- అదేవిధంగా రేపల్లె పట్టణం నుంచి సజ్జావారిపాలెం మార్గంలో అక్కిలేరు వద్ద ఒకవైపు వంతెన సైడ్‌వాల్ దెబ్బతిని ఉంది.
- పెనుమూడి గ్రామంకు వెళ్లే మార్గంలో బ్యాంక్ కెనాల్‌పై ఉన్న వంతెన అత్యంత ప్రమాదభరితంగా దర్శనమిస్తోంది. వంతెన శిథిలావస్థకు చేరటంతో పాటు ఇరువైపుల సైడ్ వాల్స్ శిథిలమై కొంత మేర ధ్వంసమయ్యాయి.
- నల్లూరుపాలెం నుంచి తుమ్మల వెళ్లే మార్గంలో పంట కాల్వపై ఉన్న వంతెన ఓవైపు సైడ్‌వాల్ దెబ్బతిని నేలకొరిగింది.
- మోళ్ళగుంట నుంచి మోళ్ళగుంట కట్టవ వెళ్లే మార్గంలో కాల్వపై ఉన్న వంతెన సైడ్‌వాల్ దెబ్బతిని ప్రమాదభరితంగా ఉంది. దీంతో పాటు ఆయా వంతెనల ముందు రహదారులు దెబ్బతిని గుంతల మయంగా మారటంతో ఆయా ప్రాంతాలలో ప్రయాణం ప్రమాదాలకు తావిస్తుందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి వంతెనలకు మరమ్మతులు నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం

నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



బెల్లంవారిపాలెంలో బాలరాజు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ గణేష్, పక్కన రామకృష్ణ

నగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వుయ్యూరి శాంతిరాజ్ తండ్రి సాంబశివరావు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతిరాజ్ కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా బెల్లంవారిపాలెంకు చెందిన పమిడిపాముల బాలరాజు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను డాక్టర్ ఈవూరు గణేష్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ, బీసీ సెల్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు పాగోలు వెంకటేశ్వరావు, కొండలరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి: ఎంపీడీవో



కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పరిసరాల పరిశుభ్రతతోనే సాధ్యమవుతుందని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ఆధ్వర్యంలో అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులతో కలసి కర్లపాలెంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత యజమానులపై ఉంటే వీధులను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, ఎంఈవో మనోరంజని, ఏవో సుమంత్‌కుమార్, కార్యదర్శి సునీత తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాల సాధనలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

అవగాహనా సదస్సులు, ర్యాలీలు



రేపల్లె నెహ్రూ బొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న అధికారులు, విద్యార్థులు

రేపల్లె రూరల్: స్వచ్ఛ రేపల్లె సాధనలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నిర్వహించిన ర్యాలీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు కాలుష్య కారిణి పాలిథిన్ నివారణకు కృషి చేయాలన్నారు. పాలిథిన్‌ను స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ నిషేధించి ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని కోరారు. అదేవిధంగా వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగి వేడిమి పెరుగుతోందని, ఫలితంగా అనేక సమస్యలు ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఉంటాయన్నారు. మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యం ఏర్పడటంతో పాటు కాలుష్యం నివారించబడుతుందని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా పెంచటాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ప్లాస్టిక్ నిరోధించాలి, పత్యామ్నాయాలను వినియోగించాలని నినాదాలు చేస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ బొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ కాకర్ల సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సభ్యులు, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కిరాణా అసోసియేషన్ సభ్యులు, ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో...

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రపరిచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కో ఆర్డినేటర్ ఎం.దాసు, కమిటీ సభ్యులు డాక్టర్ ఎం.బుజ్జి, బాలగురవయ్య, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి
ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి

నిజాంపట్నం: గ్రామీణ ప్రాంతాలే దేశానికి వెన్నెముకని, అటువంటి గ్రామీణ ప్రాంతాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన నిజాంపట్నం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాలలో సైతం రోజురోజుకు ప్లాస్టిక్ వినియోగం అధికమై కాలుష్యాల బారిన పడుతుందన్నారు. పాలిథిన్‌ను నివారించటంతో పాటు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా తడి పొడి చెత్తను వేరు చేసే విధానం, ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం ప్రధాన కూడళ్ల వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. సెంటరులోని పలు దుకాణాలను సందర్శించి క్యారీ బ్యాగ్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం మస్తాన్‌రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను ప్లాసిక్ రహితంగా ఉంచుదాం

వేమూరు: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల విద్యాశాఖాధికారి ఐ.వెంకటేశ్వర్లు అన్నారు. వేమూరు మండలంలోని జంపని మండల పరిషత్ పాఠశాలలో ప్లాసిక్ రహిత సమాజంపై ప్రతిజ్ఞ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాలను ప్లాసిక్ రహిత ప్రదేశంగా ఉంచుదామని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి- 'నో'
ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి

భట్టిప్రోలు: పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య హితం కోసం ప్రజలందరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి నో- చెబుదాం అని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి తెలిపారు. శనివారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛత కార్యక్రమంలో ముఖ్య అంశంగా ప్లాస్టిక్ నిషేధాన్ని నిర్వహించారు. పురవీధులలో ర్యాలీ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలితకుమారి ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు, ప్రతిజ్ఞ చేశారు. గ్రామ స్థాయిలో కూడా ఈ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ పై నిషేధించాలని కోరారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కార్యక్రమాలు నిర్వహించాలని, పంచాయతీ పరిధిలో గ్రామ సభ నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి తీర్మానం చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయ భాస్కరి, ఏపీఎం జి.శ్రీమన్నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు శివకృష్ణ, రావూరి సౌమ్య, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

వేమూరు: ప్లాసిక్‌ను నిషేధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దారు సుశీల తెలిపారు. మండల కేంద్రంలోని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రతి నెల మూడో శనివారం నిర్వహించాలని ఆమె తెలిపారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ తిరుపతమ్మ, పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో... రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉరేనా పర్వేన్ తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయని అన్నారు. పరిశుభ్రమైన వాతావరణ కోసం ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిర ప్రియదర్శిని, డాక్టర్ రవళి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



ఎస్పీ కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్లటౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛత దివస్' కార్యక్రమన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్, కార్యాలయాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది వారి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. విధులు నిర్వహించే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకరంగా విధులు నిర్వహించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఎస్‌బీ సీఐ నారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ మౌలుద్దీన్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది





జంపని మండల పరిషత్ పాఠశాలల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



రేపల్లెలో మొక్కలు నాటే కార్యక్రమంలో కమిషనర్ సాంబశివరావు తదితరులు

గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం

రేపల్లె రూరల్: స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా పట్టణ ప్రాంతంలో పీఎంఏవై గ్రామీణ్ 1.0 పథకంలో మంజూరై ఇంకా పూర్తికాకుండా వివిధ దశలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీటీజీ కేటగిరీలకు చెందిన గృహ నిర్మాణ లబ్ధిదారులకు తమ ఇంటిని పూర్తి చేసుకునేందుకు అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ నిర్మాణ పథకానికి ప్రస్తుతం ఇస్తున్న రూ.1,80,000 యూనిట్ కాస్ట్‌కు అదనంగా 2024 డిసెంబరు 10 నుంచి అసంపూర్తిగా ఉన్న ఎస్సీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీ లబ్ధిదారులకు రూ.1లక్ష అదనంగా ఆర్థిక సహాయం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆ శాఖ పట్టణ ఏఈ శివనాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేటేరు రోడ్డు, ప్రభుత్వ వైద్యశాల రోడ్డు, రింగురోడ్డు, తాలూకా సెంటర్, రైల్వేస్టేషన్ ఏరియా, నేతాజీనగర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం

చుండూరు(వేమూరు): విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు దేశభక్తి, సేవా భావం క్రమశిక్షణ ఉండాలని రాష్ట్ర స్కౌట్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడుతూ స్కౌట్స్ వల్ల ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందన్నారు. అందువల్ల విద్యార్థులందరు స్కౌట్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్కౌట్స్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి పాఠశాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల యూనిఫాంకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించిన పూర్వ విద్యార్థి కల్లూరు నాగేశ్వరరావుకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సతీష్, సాయిబాబు, జిల్లా స్కౌట్స్ ట్రెనింగ్ కమిషనర్ రవీంద్ర, నరేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ నిర్మించండి

బాపట్ల: ఉప్పరపాలెం రోడ్‌లోని రైల్వే గేటు వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జిని త్వరితగతిన నిర్మించాలని పౌర సమాఖ్య సభ్యులు విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర పాటిల్‌కు శనివారం విజ్ఞప్తి చేశారు. ఎక్కువ ఎత్తులో ఆర్‌యూబీ నిర్మించకపోయినా, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు అనువుగా ఉండే విధంగా నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు డీఆర్ ఎంకు అందించిన వినతిపత్రంలో కోరారు. అలాగే నాలుగో నెంబర్, ఐదో నెంబర్ ప్లాట్ ఫామ్‌లకు లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. రైలు పేట వాసులకు ఉపయోగపడే విధంగా ఫుట్ బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు. వందే భారత్, జీటీ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లను బాపట్ల స్టేషన్లో ఆపించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందించిన వారిలో పౌర సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ కె.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జమ్రుద్ బాషా, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ సాయిబాబు, సభ్యులు రామాంజనేయులు, రవీంద్ర, అప్పారావు ఉన్నారు.

వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో తహసీల్దారు సుశీల

వేమూరు: ప్రతి పోలింగ్ స్టేషన్‌కు 1200 ఓట్లు ఉండాలని తహసీల్దారు సుశీల అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఈ నెల 20న మండల పరిషత్ కార్యా లయంలో బీఎల్వోలకు సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో చనిపోయిన ఓటర్లను తొలగించాలని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు కల్పించాలని ఆమె తెలిపారు. ఓటర్ల జాబితా సవరణపై బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డిప్యూటీ తహసీల్దారు ఉన్నారు.

మహిళలకు పథకాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు

కొల్లూరు : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు, తమపై జరుగుతున్న అకృత్యాలను ఎదుర్కొనేందుకు చట్టాలను వినియోగించుకోవాలని కొల్లూరు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని జువ్వలపాలెం శివారు గుంటూరుగూడెం చర్చి వద్ద కొల్లూరు, భట్టిప్రోలు మండలాల గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వ పథకాలు, చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వం ద్వారా అందే సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం జి.శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయకూడదని సూచించారు. డీబీఆర్‌సీ రీజనల్ కోఆర్డినేటర్ డి.కోటేశ్వరరావు, తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్, డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ వి.భగవాన్‌దాస్, శ్రీలత, బి.తేజోబాబు, పి.మనోజ్ కుమార్, జి.సుధకార్ పాల్గొన్నారు.

వైభవంగా నెల్లెమ్మ తల్లి తిరునాళ్ల



చెరుకుపల్లి: ఆరుంబాక నెల్లెమ్మ తల్లి అమ్మవారి తిరునాళ్ల నూతన గుడి నిర్మించిన మొదటి సంవత్సరం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు, అనంతరం మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఫార్మసీ కళాశాలలో దంత వైద్య పరీక్షలు



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాపట్ల: బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ, సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు డెంటల్ హెల్త్ చెకప్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు ప్రారంభించారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించారు. డాక్టర్లు తాళ్ళూరి దేవకి, పొట్లూరి రాజశేఖర్ మాట్లాడుతూ తరచూ దంత సమస్యలు వస్తున్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఇ.జి.కె మూర్తి, సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.